సాక్షి
వికారాబాద్
గురువారం । 23 । నవంబర్ । 2023



'పేట'లో ఓట్ల వేట

మోమిన్‌పేట మండల పరిధిలోని గ్రామాల్లో కారు, హస్తం నేతలు హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. 10లో▸



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



తాండూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనసందోహం

కాంగ్రెస్ అంటేనే దళారీ రాజ్యం

కాంగ్రెస్ పార్టీలో దళారులు, పైరవీకారులదే రాజ్యం అని సీఎం కేసీఆర్ విమర్శించారు. ధరణి స్థానంలో భూమాత తీసుకుని వస్తామంటున్న ఆ పార్టీ నేతలు.. ముందుగా అది భూమాతనో లేక భూమేతనో చెప్పాలన్నారు. దాదాపు యాభై ఏళ్ల అధికారంలో ఉన్న ఆ పార్టీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. తాండూరు, పరిగి, కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని సూచించారు. అవసరమైతే ఎన్నికల అనంతరం గెలిచినాక ఒకరోజు ఇక్కడికి వస్తాను. ఏంఏం అభివృద్ధి పనులు చేపట్టామో.. భవిష్యత్‌లో మీకేం కావాలో చర్చిద్దామన్నారు.

ధరణిని తొలగిస్తామంటున్న పార్టీని తరిమికొడదాం

- వారిది భూమాత కాదు.. భూమేత
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ఫైర్

తాండూరు/పరిగి/కొడంగల్: తెలంగాణ సీఎం, బీఆర్ఎస్ దళపతి కేసీఆర్ బుధవారం తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో కాంగ్రెస్ పార్టీమీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముందుగా తాండూరు పట్టణంలోని విలియంమూన్ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతి తండాకు, గ్రామానికి.. తాగునీరు, కరెంటు అందించామని తెలిపారు. తాండూరు పక్కనే ఉన్న కర్ణాటకలో వ్యవసాయానికి 5 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నారని స్పష్టం చేశారు. మన రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే ధరణి వ్యవస్థను రద్దుచేసి దాని స్థానంలో భూమాత పెడతామంటున్నారని, అది భూమాత కాదు.. భూమేత అని ఎద్దేవా చేశారు. రైతులకు మేలుచేసే ధరణిని రద్దు చేస్తామంటున్న ఆ పార్టీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు.

అభ్యర్థిపై చర్చ పెట్టండి

తెలంగాణలో మూడోసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి పార్టీ నుంచి ఎవరో ఒకరు నిలబడతారని, అభ్యర్థుల గురించి ప్రజలు ఆలోచన చేయాలని.. ఆ వ్యక్తి ఎలాంటి వాడో, ఆయన వెనక ఉన్న పార్టీ చరిత్ర, ప్రజల గురించి వారి దృక్పథం గురించి తెలుసుకుని ఓటెయ్యాలని సూచించారు. గతంలో తాండూరు ప్రాంతంలో 30- 40 మంది రైతులు విద్యుదాఘాతాలకు గురై చనిపోయాన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తాండూరులో రోహిత్‌రెడ్డి బరిలో నిలిపామన్నారు.ప్రజలందరూ రోహిత్‌రెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. ప్రచార సభ కు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, మున్సిపల్ చైర్మన్ స్వప్న, వైస్ చైర్మన్ దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ తదితరులున్నారు.

సమస్యలన్నీ తీరుస్తాం

రెండోసారి పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే ఆయనకు ప్రమోషన్ ఖాయమని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో బుధవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడుతూ.. కొడంగల్‌లోని సమస్యలన్నీ తీరుస్తామని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కొడంగల్‌కు కాంగ్రెస్ పీసీసీ చీఫ్ చేసిందేమీ లేదన్నారు.

పరిగిలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు..

ప్రజల దగ్గర ఉండే వజ్రాయుధం ఓటుహక్కు... ఆ ఓటును నిజాయితీ ఉన్న వ్యక్తికి వేసి గెలిపించాలని సీఎం కేసీఆర్ అన్నారు. పరిగి పట్టణ కేంద్రంలోని జింగకన్న గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. పరిగిలో ఏ పార్టీ గెలిస్తే రాష్ట్రంలో కూడా అదే పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. పరిగి ప్రజలు 2018 ఎన్నికల్లాగే మహేశ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిగిలో అనేక అభివృద్ధి పనులను చేశామన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరిగిలో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు కావాలని కోరారన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో కళాశాలలను మంజూరు చేస్తామన్నారు. అలాగే దాదాపూర్, కంకల్ మండలాలను ఏర్పాటు చేసి గండీడ్‌ను వికారాబాద్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఇవి జరగాలంటే మరోసారి మహేశ్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఎన్నికల తర్వాత పరిగికి వస్తా.. ఇక్కడే ఉండి పనులన్నీ చేయిస్తానని తెలిపారు. మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేశవరావు, మధుసూదనచారీ, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్ రెడ్డి, కాసాని వీరేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రూ.కోటితో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశా



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ప్రతి గ్రామానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాండూరు ప్రాంతంలో కందిబోర్డు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు తాండూరుకు చాలా దూరం అవుతోందని.. దీనికి పరిష్కారంగా తాండూరు నియోజవకర్గంలోని తట్టిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వే చేయించామని.. నివేదికలను సమర్పించానని.. రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. అలాగే కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణ కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు తాండూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. తాండూరులో మరోసారి తనను ప్రజలు గెలిపించాలని కోరారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను మంత్రిగా ఉన్నప్పుడు తాండూరు నియోజకవర్గంలో రూ.3వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సైతం పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నాడన్నారు. రోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, వైద్యమౌలిక సదుపాయాల రాష్ట్ర మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ప్రజా ఆశీర్వాద సభలో పరిగి బీఆర్ఎస్ అభ్యర్థి మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటినీ సీఎం కేసీఆర్ నెరవేర్చారన్నారు. పరిగిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరగా.. కళాశాలను మంజూరు చేశారని.. ప్రస్తుతం ఇక్కడ ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలోని మెజార్టీ గ్రామాలకు బీటీ రోడ్లను వేశామన్నారు. 54 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారన్నారు. పరిగికి అడిగినవన్నీ ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ఇక్కడి ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



వెబినార్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులతో వెబినార్

వికారాబాద్ అర్బన్: ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం భారత సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వెబినార్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వారికి వివరించారు. జిల్లాలో కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశామని ఓటింగ్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను సైతం ఇప్పటికే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 82శాతం మేర పంపిణీ పూర్తిచేశామని వివరించారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు 830 మంది హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లో ప్రత్యేక పోలింగ్ బృందాల ద్వారా మిగిలిన వారందరికీ హోం ఓటింగ్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఈసీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. పోలీసులు సహా ఇతర ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు..

సి-విజిల్ యాప్ గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని, సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటికోసం వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గడువులోపు అనుమతులు జారీచేస్తున్నామని అన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పామన్నారు. ఈ వెబినార్‌లో ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణన్, ఎక్స్పెండీచర్ మోడల్ అధికారి శంకరాచారి, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథంపై మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అర్హులందరికీ రేషన్ కార్డులు

కాంగ్రెస్ వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని ఆ పార్టీ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలంలోని పెండ్లిమడుగు, పులుమద్ది, అత్వెల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మాయమాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. గత తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజా హామీలను విస్మరించిందని అన్నారు. వికారాబాద్‌లో ఇప్పటివరకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, మోహన్, శివయ్య, బందెల్లి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక గ్యారెంటీలకే దిక్కులేదు

- తెలంగాణలో నమ్మి మోసపోవద్దు
- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

షాబాద్: కర్ణాటకలో ఇచ్చిన ఐదు హామీలకే దిక్కులేదు.. తెలంగాణలో చేస్తామంటే ఎవరూ నమ్మరని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ, తాళ్లపల్లి, రుద్రారం, మద్దూరు, నాగర్‌కుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గ్రామాల రూపు రేఖలు మారాయని, అప్పటి వరకు ఏలిన కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎన్ని గంటల కరెంటు ఇస్తుందో మాట్లాడే దమ్ముందా అన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రైతుల కష్టాలు తెలిసిన బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య నాయకులు శ్రీరాంరెడ్డి, సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణాగౌడ్, పెంటయ్య, స్వర్ణలత, మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలకు వందనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చిత్రంలో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

సభను విజయవంతం చేయండి

బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్

అనంతగిరి: వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో గురువారం జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన సభాస్థలి, వేదిక వద్ద పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12.30గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. సభలో దాదాపు 50వేల మంది ప్రజలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, దేవదాసు, బుచ్చిబాబు గౌడ్, విజయ్‌కుమార్, కృష్ణయ్య, షకీల్, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

న్యూస్‌రీల్

సీఎం నివాళి



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్

పరిగి: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ఉప సభాపతి కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం సీఎం కేసీఆర్ పరిగిలో ప్రజా ఆశీర్వాద సభకు వెళ్లే ముందు హెలిపాడ్ నుంచి నేరుగా ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన వ్యక్తి హరీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయనతో తనకు 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన ఎనలేని సేవలందించారని.. అదే బాటలో ఆయన తనయులు ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, అనిల్‌రెడ్డి ఉన్నారన్నారు.

వసతులు కల్పించాలి

ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



గాజీపూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పెద్దేముల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలంలోని గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ వద్ద కరెంటు, తాగునీరు తదితర అన్ని వసతులు ఉండేలా చుడాలని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మొత్తం 46 పోలింగ్ స్టేషన్ల వద్దవసతులు కల్పించాలన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలి

రాష్ట్ర అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉషారాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉషారాణి

మోమిన్‌పేట: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. మండల పరిధిలోని మేకవనంపల్లి ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ పద్ధతిపై విద్యార్థులకు బోధించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు. తరగతిగదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీ, పాఠ్య ప్రణాళిక, మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్, డీఆర్‌పీ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో జోరు పెంచింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం పలు పార్టీలకు చెందిన నాయకులు హస్తం గూటికి చేరారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి రేవంత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి బొల్వోనిపల్లి, పీసీ తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, రేవంత్ సోదరుడు కృష్ణారెడ్డి పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

క్లుప్తంగా

పొరపాట్లకు తావివ్వొద్దు

కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సుధాకర్ గ్లాల్జో



చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న సుధాకర్ గ్లాల్జో

కుల్కచర్ల: ఎన్నికల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం తావివ్వొద్దని కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సుధాకర్ గ్లాల్జో అన్నారు. బుధవారం ఆయన చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ విజయానికి కృషి

టీడీపీ నాయకుడు రామకృష్ణ



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రామకృష్ణ

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ గెలుపుకోసం నిరంతరం పనిచేస్తానని టీడీపీ రాష్ట్ర నాయకుడు కరణం రామకృష్ణ అన్నారు. బుధవారం మండలపరిధిలోని కోల్కుందలో ఆయన ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, సర్పంచ్ పార్వతమ్మ, ఉప సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, కరణం భుజంగం, మధుసూధన్‌రెడ్డి, గందె సంగమేశ్, మొగులిరెడ్డి. రాచయ్య, బ్రహ్మానందరెడ్డి, కుత్బుద్దీన్, అబ్దుల్, బొబ్బిలి వీరేశం, వడ్ల విశ్వనాథం తదితరులు ఉన్నారు.

‘పేట’లో ఓట్ల వేట

• విజయం కోసం నేతల ఆరాటం • ప్రచారంలో దూసుకుపోతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

నియోజకవర్గ ఏర్పాటు నుంచి మోమిన్‌పేటలో మెజార్టీ సాధించిన వారే అసెంబ్లీ నుంచి గెలుపొందుతున్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీలకు పట్టం కట్టిన ఓటర్లు గత రెండు ఎన్నికల్లో ‘కారు’కు జైకొట్టారు. దీంతో ఇక్కడ అధిక ఓట్లను రాబట్టేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు చెమటోడుస్తున్నారు.



మోమిన్‌పేట: మండల పరిధిలోని గ్రామాల్లో కారు, హస్తం నేతలు హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ప్రచారానికి ఆరు రోజుల సమయమే ఉంది. కానీ బీజేపీ, బీఎస్పీ నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు నేటికీ మండలంలో ప్రచారం ప్రారంభించలేదు.

‘హస్త’గతం చేసుకునేందుకు ప్రసాద్‌కుమార్

నియోజకవర్గంపై మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు మాజీ మంత్రి, పార్టీ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ ఈ నెల 18న ప్రచారం ప్రారంభించారు. ఇప్పటికే ఆయన పది గ్రామాల్లో ప్రచారం పూర్తి చేశారు. 21న తిరిగి ప్రచారం ప్రారంభించిన గడ్డం 11 గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇక ఒక్క గ్రామంలో ప్రచారం నిర్వహిస్తే ఆయన మండల పర్యటన పూర్తవుతుంది. ఆయన ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపైనే దృష్టి సారించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో పాటుగా మేనిఫెస్టోను ఆయన ప్రజల్లోకి తీసుకువెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆయన ప్రచారానికి ఏబీసీసీ సభ్యులు సైతం విచ్చేసి స్నేహ హస్తం అందిస్తున్నారు. నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వివరిస్తూ యువతను ఆకర్షించే యత్నం చేస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచ్‌లపై వ్యక్తిగత విమర్శలు చేస్తుండడంతో ఒకింత విమర్శలను ఎదుర్కొంటున్నారు.

మళ్లీ ఆశీర్వదించాలని ఆనంద్

ప్రచారం ప్రారంభించిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మొదటి విడతలో నాలుగు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఈ నెల 21 నుంచి నిర్వహించిన ప్రచారంలో మరో నాలుగు గ్రామాలను చుట్టేశారు. కాగా పది గ్రామాల్లో ఇంకా ఆనంద్ ‘కారు’ తిప్పాల్సింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తెలంగాణ ఏర్పడక ముందు ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని తనదైన శైలిలో వివరిస్తూ ఓటర్లను జారిపోకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. భగీరథ తాగునీరు, 24గంటల విద్యుత్ సరఫరా, రైతు బంధు, బీమా, రుణమాఫీ, దళారులు లేని పంటల కొనుగోళ్లు, పరిశుభ్రమైన పల్లెలు తదితర అంశాలను వివరిస్తూ వ్యతిరేక ఓటరులు ఇతర పార్టీల వైపు చూడకుండా ప్రచారం కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి అగం కావద్దని తెలియజేస్తూ మరో సారి కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

మనోహర్‌రెడ్డి విజయం ఖాయం



పెద్దేముల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్ రాథోడ్

కర్ణాటక ఎమ్మెల్యే సుభాష్ రాథోడ్

పెద్దేముల్: తాండూరులో కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి గెలుపు ఖాయమని కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే సుభాష్ రాథోడ్ అన్నారు. కర్ణాటక సరిహద్దులోకి బాయిమీదితండా, ఊరెంటితండా, జైరాం తండా, సిద్దన్న మడుగుతండా, తట్టెపల్లితో పాటు పలు గిరిజన తండాలల్లో ఆయన మనోహర్‌రెడ్డి విజయం కోసం బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే తండాలు అభివృద్ధి చెందాయన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌కు గాలి ఎలా వచ్చిందో.. తెలంగాణలోనూ అదే కొనసాగుతుందన్నారు. అధికారంలో కి రాగానే ఆరు గ్యారెంటీలు తప్పకుండా అమలు చేస్తుందన్నారు. గిరిజన, దళిత, మైనార్టీ, బీసీలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ధారాసింగ్, మైనార్టీ కన్వీనర్ రియాజ్, మాజీ సర్పంచ్‌లు శివరాం నాయక్, బాబుసింగ్ నాయకులు రామ్‌షట్టి, సుమిత్ర, సంజు, జయరాం ,నర్సింలు, లాల్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కరన్‌కోట్ కాంగ్రెస్ కంచుకోట

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామం కాంగ్రెస్ అడ్డా అని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ప్రచారం ఉండగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరులో కాంగ్రెస్ గెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన హస్తం పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.



తాండూరు రూరల్: శరణు బసప్పను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి

హస్తం పార్టీలో చేరిన మాజీ ఎంపీపీ

కరన్‌కోట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ శరణు బసప్ప తన అనుచరులతో కలిసి మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకుల నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయని బసప్ప ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ఉత్తమ్‌చందు, జనార్దన్‌రెడ్డి, రాకేష్ మహారాజ్, రాజ్‌కుమార్, రవిగౌడ్, శ్రీను, రాందాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మొద్దు



భీంభరత్‌తో కలిసి నడుస్తున్న వృద్ధురాలు

నవాబుపేట: బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఏకతాటిపై పనిచేస్తున్నాయని వారిని నమ్మి మోసపోతే గోసపడుతామని కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పూలపల్లి, అక్నాపూర్, అత్తాపూర్, నారెగూడ, తిమ్మారెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్.. నియోజకవర్గంలో కాలె యాదయ్య కుటుంబ పాలన సాగిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు అండగా.. ఇందిరమ్మ రాజ్యం తీసుకువచ్చేందుకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు సామ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎక్బాల్, అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



మోమిన్‌పేటలో పోల్ చీటీలు పంపిణీ చేస్తున్న కార్యదర్శి నర్సింలు

మోమిన్‌పేట: మండలంలోని గ్రామాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ బుధవారం చేపట్టారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. రాజకీయ పార్టీలు స్లిప్పులను ఇచ్చే సంస్కృతిని ఎన్నికల సంఘం రద్దు చేసి, ప్రభుత్వ అధికారులే పంపిణీ చేయాలని ఆదేశించారు. మోమిన్‌పేటలో 69వ పోలింగ్ స్టేషన్ పరిధిలో కార్యదర్శి నర్సింలు స్లిప్పుల పంపిణీ ప్రారంభించారు.



కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం అశోక్ మాస్టర్ ఆధ్వర్యంలో గుస్సాడీ నృత్య కళాకారులు ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు పార్టీ జెండాలు చేతబట్టి బతుకమ్మ పాటలకు కదం కలపగా.. గుస్సాడీ కళాకారులు వారిని అనుసరించారు. – ధారూరు

ప్రతిపక్షాలతో గుస్సా‘ఢీ’

ఇందిరమ్మ రాజ్యంతోనే అభ్యున్నతి

• డీసీసీ అధ్యక్షుడు, పరిగి అభ్యర్థి .రామ్మోహన్‌రెడ్డి



వాల్యానాయక్ తండాలో టీఆర్‌ఆర్ ప్రచారం

కుల్కచర్ల: ఇందిరమ్మ రాజ్యంతోనే సబ్బండ వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చౌడాపూర్ మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో గిరిజనులకు సాగు చేసుకునేందుకు భూములు ఇవ్వడంతో పాటు ఉచితంగా బోర్లు వేయించిందన్నారు. కానీ అధికార బీఆర్‌ఎస్ నేతలు మాత్రం నేడు గిరిజనుల భూములను లాక్కునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, లింగంపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీనర్సింహ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, నాయకులు బాలముకుందం, విఠల్‌నాయక్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

వారంటీ లేని గ్యారెంటీలు



మాదిరెడ్డిపల్లిలో కాలె యాదయ్య ప్రచారం

• బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
• పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి కాలె యాదయ్య

నవాబుపేట: కాంగ్రెస్ ఇస్తామంటున్న ఆరు గ్యారెంటీలకు వారంటీ లేదని, అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ఆరోపించారు. బుధవారం మండలంలోని ఎక్మామిడి, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి ఏడాది క్రితం వరకు ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవాలన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి కావాలో.. నిత్యం ప్రజల మధ్య ఉండే వాళ్లు కావాలో ఓటర్లే ఆలోచన చేయాలన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే బీజేపీని నమ్మితే నట్టేట ముంచుతారన్నారు. అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. మరోసారి అవకాశం ఇస్తే ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌గౌడ్, రాంరెడ్డి, బందయ్యగౌడ్, నాగిరెడ్డి, చిట్టెం మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, రంగారెడ్డి, ఎండీ రఫీ, మల్లేశం, పర్మయ్య, రత్నం, శివరాజ్, శాంతకుమార్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజనులకు మేలు

అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్



గిరిజనులకు గ్యారెంటీలను వివరిస్తున్న రాఘవన్

మర్పల్లి: తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్లు అవుతున్నా తండాలు అభివృద్ధికి నోచుకోలేదని అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ ఆరోపించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పట్లూర్, మర్పల్లి, గుర్రంగట్టు తండాలలో కాంగ్రెస్ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తండాల అభివృద్ధిని విస్మరించాన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, అసైన్డ్ భూములు ఇచ్చారని గుర్తు చేశారు. గిరిజనులకు మేలు చేసిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చినా అభివృద్ధి పనుల కోసం నిధులు ఇవ్వక పోవడంతో పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, కౌన్సిలర్ చందర్‌నాయక్, మాజీ సర్పంచ్ పాండునాయక్, సేవాలాల్ సేనా అధ్యక్షుడు రమేశ్, నాయకులు ధరమ్‌సింగ్, పరుషరామ్, గోవర్ధన్, గోపాల్, రాంచందర్, సంతోష్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రమిచ్చిన పార్టీకి ఓటేయండి

• ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్సే
• కేసీఆర్‌ను నమ్మితే మరోసారి మోసపోతాం
• పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు
• వికారాబాద్ అభ్యర్థి ప్రసాద్ కుమార్




పెండ్లి మడుగులో నృత్యం చేస్తున్న మహిళలు, (ఇన్‌సెట్‌లో) కొంపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రసాద్ కుమార్

వికారాబాద్ అర్బన్: తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈ సారి ఓటు వేసి సోనియమ్మకు బహుమతిగా ఇవ్వాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పులుమద్ది, ఎర్రవల్లి, అత్వెల్లితో పాటు మున్సిపల్ పరిధిలోని కొంపల్లి, ధన్నారం, ఆలంపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తే ఆంధ్ర, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి నష్టమనే విషయం తెలిసినా సోనియమ్మ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ఇస్తే టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానన్న కేసీఆర్ రాష్ట్రం ఏర్పడిన తరువాత మోసం చేసి సీఎం కుర్చీ ఎక్కాడని ఆరోపించారు. 2014 నుంచి కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం పరిపాటయిందని ఆయన ఆరోపించారు. పథకాలు, ప్రాజెక్టుల పేరిట ప్రజలను మోసం చేస్తూ లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. కమీషన్లకోసం నిర్మించిన ప్రాజెక్టులు పదేళ్లు తిరగకుండానే పాడవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజలు కేసీఆర్ మోపూరిత మాటలను నమ్మవద్దని తెలిపారు.

ఉచిత విద్యుత్ కాంగ్రెస్ చలవే

ఉచిత విద్యుత్ కరెంట్ విధానం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్‌పైనే బురదజల్లేందుకు అధికార పార్టీ యత్నిస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడంతో పాటు రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగుల కలను సాకారం చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా తాను మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే దర్శనమిస్తున్నాయని గుర్తు చేశారు. ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.